## స్పందనకు 231 అర్జీలు



చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఈ వారం జిల్లా నలుమూలల నుండి 231 అర్జీలు అందాయి. కలెక్టరేట్‌లో సోమ వారం జరిగిన స్పందన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలతో హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసకోవాలని సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 148 అర్జీలు అందాయి. అలాగే పెన్షన్లు, రేషన్ కార్డుల కోసం 55 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలి

తిరుపతి కలెక్టరేట్, జూన్ 12, ప్రభాతవార్త



స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని, అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టరేట్ వెంకటరమణా రెడ్డి అధికారులను ఉద్దేశించి అన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డి.కె. బాలాజీతోకలిసి జిల్లా కలెక్టర్ స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు ఇంచార్జి డిఆర్ఓ కోదండ రామిరెడ్డి, ఎస్‌డిసిలు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 132 వినతులు రావడం జరిగిందని, సకాలంలో పరిష్కరించాల్సిందిగా జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# తెప్పపై ఊరేగిన శ్రీచెంగాళమ్మ



కాళంగి నదిలో తెప్పపై అమ్మవారు



పగడాల చీరలో అమ్మవారు

సూళ్లూరుపేట, జూన్ 12 ప్రభాతవార్త
శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి తిరునాళ్లలో భాగంగా అమ్మవారు సోమవారం దేవస్థానానికి సమీపంలోని కాళంగి నదిలో తెప్పపై విహరిస్తూ సేదతీరారు. ముందురోజు మహిషాసురమర్ధినితో రాక్షక సంహారం చేసిన అమ్మణ్ణి విజయోత్సాహంతో సింహవాహనంపై గ్రామోత్సవానికి వెళ్లి, తర్వాత రోజు తెప్పపై కాళంగి నదిలో సేదతీరారు. కాళంగి నదిలో తెప్పోత్సవానికి కన్నులపండువగా నిర్వహించేందుకు దేవస్థానం కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి భక్తులకు తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వీలు కల్పించారు. ఇందులో భాగంగా భక్తజన సందోహం ఎక్కువగా తరలివచ్చినప్పటికీ తెప్పోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. అమ్మణ్ణి ఉత్సవ విగ్రహాన్ని తెప్పలో ఉంచి కాళంగి నదిలో మూడు పర్యాయాలు తూర్పు, పడమర వైపు తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మణ్ణి తెప్పపై సేదతీరుతూ ఊరేగుతున్న దృశ్యాలను చూసి భక్తులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా బాణాసంచా కాల్చడంతో భక్తులను ఆకట్టుకుంది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు దగ్గరుండి తెప్పోత్సవాన్ని విజయవంతం చేశారు. అలాగే తిరునాళ్ల నిర్వహణకు సహకరించిన భూరి విరాళ దాతలను తెప్పపై ఎక్కించి అమ్మణ్ణిని దర్శించుకునే ఏర్పాటు చేశారు. జనసందోహం ఎక్కువ కావడంతో పోలీసులు వారిని అదుపు చేసేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఈ సందర్భంగా దేవస్థానంలోని మూలవిరాట్‌కు పగడాల చీరతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. అమ్మణ్ణిని దర్శించుకునేందుకు తెప్పోత్సవానికి వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు.

## 21న చిత్తూరుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి రాక



చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 21వ తేదీ చిత్తూరుకు రానున్నారు. చిత్తూరు విజయ డైరీ స్థలంలో నూతనంగా నిర్మించనున్న ఆమూల్ డెయిరీ నిర్మాణానికి భూమి పూజతో పాటు చీలాపల్లి వేలూరు సిఎంసి ఆసుపత్రిలో జరిగే సమావేశంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు. సిఎం పర్యటనకు సంబంధించి అధికారిక ప్రకటన రెండు రోజుల్లో విడుదల కానుంది.

# పేదలకు విద్య.. కుటుంబ ఆర్థికస్థితికి అండ

### - జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త:
పేద విద్యార్థులకు విద్య అందిస్తే వారి కుటుంబ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని సిఎం భావించి జగనన్న విద్యా కానుక పథకంను అమలు చేస్తున్నారని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. 4వ విడత జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమంను సోమవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా క్రోసూరు నుండి లాంఛనంగా ప్రారంభించగా జిల్లాకు సంబంధించి ఈ కార్యక్రమంను చిత్తూరు గిరింపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1 నుండి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా జగనన్న విద్యా కానుక కిట్లను వరుసగా నాల్గవ ఏడాది పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన 1,67,154 మంది విద్యార్థులకు రూ.41.79 కోట్ల ఖర్చుతో విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పేదలకు అందించే నిజమైన ఆస్తి విద్య ఒక్కటేనని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భావిస్తున్నారన్నారు. ఈ ఏడాది సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి విద్యార్థులకు నాణ్యమైన కిట్ల పంపిణీకి చర్యలు తీసుకొన్నారన్నారు. సిఎం వైఎస్ జగన్ విద్యార్థులకు మేనమామగా ఎల్‌కెజి నుండి పిజి వరకు ఉచితంగా విద్య అందిస్తున్నారన్నారు. విదేశాలకు వెళ్ళి విద్యనభ్యసించడానికి సైతం చర్యలు తీసుకొంటున్నారన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లలో విద్యార్థులకు ఒక స్కూల్ బ్యాగ్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్స్‌లు, బెల్ట్‌లు, మూడు జతల యూనిఫాంలు, డిక్షనరి, టెక్ట్‌బుక్స్, వర్క్‌బుక్‌లు వుంటాయన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి కేంద్రీకరించి విద్యను అభ్యసించాలన్నారు. ఇంగ్లీషు బోధనతో విద్యార్థులు బయట ప్రపంచం పోటీని తట్టుకొని నిలబడగలుగుతారని పేర్కొన్నారు.



జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించి పలు సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిఎం వైఎస్ జగన్ విద్యార్థులను ఉచితంగా చదివించడానికి కంకణం కట్టుకొని అడుగులు వేస్తున్నారన్నారు. సిఎం వైఎస్ జగన్ అమ్మఒడి కార్యక్రమంను చిత్తూరు నుండి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిఇఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, డిప్యూటీ మేయర్లు రాజేష్‌కుమార్‌రెడ్డి, ఆర్.చంద్రశేఖర్‌లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, ఎంఇఓ సెల్వరాజ్, స్థానిక కార్పొరేటర్ ఇందు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారి

### ప్రమాదాలకు కేరాఫ్

# అంజేరమ్మ కనుమ

వడమాలపేట, జూన్ 12 ప్రభాతవార్త: మండల పరిధిలోని అంజేరమ్మ కనుమ ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో అంజేరమ్మ కనుమ వద్ద తరచూ ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వడమాలపేట టోల్‌ప్లాజాకు కి.మీ దూరంలో అంజేరమ్మ తల్లి ఆలయం ఉంది. మంగళవారం, శుక్రవారం, ఆదివారాలల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆలయం రోడ్డుకు పక్కనే ఉండడం వల్ల ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్న ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. గుడి వద్ద అధికారులు స్పీడ్ బ్రేకర్ గతంలో ఏర్పాటు చేశారు. అయితే స్పీడ్ బ్రేకర్‌ను గుర్తించని వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో తమిళనాడుకు చెందిన మహిళ మృతిచెందారు.దీంతో అధికారులు స్పీడ్ బ్రేకర్‌ను తొలగించారు. టోల్ ప్లాజా నుంచి అంజేరమ్మ కనుమకు కి.మీ దూరం ఉంది. తిరుపతి వైపు నుంచి అంజేరమ్మ కనుమకు వచ్చే భక్తులు వన్‌వే కావడంతో టోల్‌ప్లాజా నుంచి 3 కి.మీ ముందుకు వెళ్లి తడుకు ఆర్‌ఎస్ వద్ద యూటర్న్ తీసుకుని 2 కి.మీ వెనుకకు రావాల్సి ఉంది. అయితే గుడికి వెళ్లే వాహన చోదకులు దగ్గరే కదాని రాంగ్ రూట్లో వాహనాలకు ఎదురుగా వెళుతుంటారు. వాహన చోదకులు ఏ మాత్రం ఏమరు పాటుగా ఉన్నా ప్రమాదాలకు గురి కావాల్సిందే. ఇలా రాంగ్ రూట్లో వెళ్ళడం వల్లే ఆదివారం జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. అధికారులు ఇకనైనా స్పందించి వాహనాలు ఎదురుగా వెళ్ళకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# బాల కార్మిక రహిత సమాజ ఆవిష్కరణ

### - కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త:
బాల కార్మిక రహిత సమాజ ఆవిష్కరణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. చిత్తూరు గాంధీ సర్కిల్ ఆవరణలో సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్, కార్మిక శాఖ సహాయ కమీషనర్ ఓంకార్‌రావుతో కలిసి ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వంద శాతం బాల కార్మికులు లేకుండా చేయాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. అలాగే బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వుందన్నారు. 14 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్ట వ్యతిరేకమన్నారు. పిల్లలు చదువుకొంటే ఆ కుటుంబం ఆర్థికంగా ముందడుగు వేస్తోందన్నారు. జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ బాలలకు రాజ్యాంగం కల్పించాల్సిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. 2000 సంవత్సరం నుండి బాల కార్మికులను తగ్గించడంలో ప్రపంచం పురోగతి సాధిస్తోందన్నారు. 14 సంవత్సరాలలోపు పిల్లలు ఎవరైనా పనిలో వుంటే వారిని గుర్తించి బడికి తీసుకెళ్ళి చేర్పించాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకొన్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ కమీషనర్ ఓంకార్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఇద్దరు బాల కార్మికులను గుర్తించి సంబంధిత యాజమానులపై చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీ చర్చివీధి, పొన్నియమ్మన్‌గుడి, ఎంఎస్ఆర్ సర్కిల్ నుండి గాంధీ సర్కిల్ వరకు సాగి మానవహారం నిర్వహించి కార్యక్రమం ముగించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి జగదీష్‌బాబు, దిశా ఎస్ఐ నాగచైతన్య, సిడిపిఓ నిర్మల, డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మికులు, పారా లీగల్ వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఊరించి చిరుజల్లులతో

# పలకరించిన "నైరుతి"

### ఉభయజిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షం



ప్రభాతవార్త-తిరుపతి:
మూడునెలలుగా వేసవిలో తీవ్రమైన సూర్యప్రతాపంతో ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు నైరుతిరుతుపవనాలు ఊరించి ఊరించి చివరకు సోమవారం సాయంత్రం చిరుజల్లులతో పలకరించింది. ఉదయం నుండి వాతావరణం తీవ్రంగా ఉండి సూర్యప్రతాపం కూడా 41డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం 3-4గంటల మధ్య ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైంది. సాయంత్రం 5గంటల సమయంలో చిరుజల్లులు మొదలయ్యాయి. నైరుతి భారీ వర్షాన్ని కురిపిస్తుందని జనం అంతా ఆశతో చూశారు. చివరకు వానమ్మ తిరుపతి నగరం పరిసరాలు, రేణిగుంట,చంద్రగిరి తదితర ప్రాంతాల్లో చిరుజల్లులకే పరిమితమైపోయింది. కొద్దిపాటి కురిసిన వర్షంతో మరింత వేడి ప్రభావంతో ఉక్కపోతకు జనం విలవిలాడిపోయారు. వానమ్మా రావమ్మా....అంటూ ప్రజలు,యువత వేడుకున్నారు. తొలిరోజు చిరుజల్లులతోనే పలకరించిన నైరుతి మళ్ళీ రెండురోజుల్లో భారీ వర్షం కురవవచ్చని భావిస్తున్నారు.

# నిర్ణీత సమయాల్లో స్థానికులకు అంతరాలయ దర్శనాలు

◆ ధర్మరాజుల తిరునాళ్లులో ఉచిత కంకణాలు ◆ ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానిక భక్తులకు నిర్ణీత సమాయాల్లో అంతరాలయ దర్శనాలకు అనుమతించుటకు, అలాగే ఏటా నిర్వహించే ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే అగ్నిగుండ ప్రవేశం కంకణాలు ఈ ఏడాది నుంచి ఉచితంగా అందించుటకు సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. సమావేశం జరిగిన తరువాత ఏర్పాటు చేసిన విలేకరలు సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు.

**నిర్ణీత సమాయాల్లో అంతరాలయ దర్శనాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయం పట్టణ నడిబొడ్డులో ఉండటంతో స్థానికుల తాకిడి అధికంగా ఉంటుందని కాబట్టి స్థానికులకు ప్రాధాన్యత కల్పించుటకు ధర్మకర్తల మండలి సమావేశంలో సుధీర్ఘంగా చర్చించిన మీదట ఉదయం 5 నుంచి 7 వరకు సాయంత్రం 7 నుంచి 9గంటల వరకు అంతరాలయ దర్శనంకు అనుమతించాలని నిర్ణయించినట్లు తెలిపారు.అలాగే ఏటా నిర్వహించే ధర్మరాజుల స్వామి తిరునాళ్ళు అగ్నిగుండ ప్రవేశానికి గతంలో రూ.20లు టిక్కెట్లు వసూలు చేసే వారని అయితే ఈ ఏడాది నుంచి కంకణాలు ఉచితంగా అనుమతించుటకు నిర్ణయించుకున్నామన్నారు. ఇక విఐపిలకు నిర్ణీత సమయాల్లో ప్రోటోకాల్ దర్శనాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.కుమారస్వామి తిప్ప వద్ద ఆడికృత్తిక సందర్భంగా నిర్వహించే స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం సందర్భంగా కనీసం 500 మంది కూర్చొని తిలకించే విధంగా మండపం నిర్మించుటకు మరో తీర్మానం చేసామన్నారు.

**స్వర్ణముఖి మురికి తొలగించుటకు పైప్‌లైన్స్:**

సమావేశంలో శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి పలు కీలక సూచనలు చేసారు. ముఖ్యంగా స్వర్ణముఖిలో చేరుతున్న మురికి నీటిని తొలగించుటకు టిఎంవి కండ్రిగ నుంచి చెంబేడు కాలువ ప్రాజెక్టు వరకు రెండు వైపులా పైప్‌లైన్ల ద్వారా మళ్ళించుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.కాగా




శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని వేధిస్తున్న లీకేజి సమస్య పరిష్కారానికి ఓ దాత ముందుకు వచ్చారని రూ.3కోట్లతో మరమ్మత్తులు చేయటానికి తీర్మానం చేసామన్నారు.ఇక బంగారు నాగపడగలతో పూజలు నిర్వహించుటకు రూ.లక్ష అవుతుంది కాబట్టి అంత మొత్తంతో భక్తులు ముందుకు వస్తారా? అనేది చర్చించామన్నారు. అంతర్గత బదిలీలకు సంబంధించి ధర్మకర్తల మండలి అనుమతితో మాత్రమే చేయాలని మరో తీర్మానం చేసారు.కాగా ఓ సభ్యురాలు అధికారులు బోర్డు అంటే చులకనగా చూస్తున్నారని ప్రోటోకాల్ పాటించటం లేదని రాతమూలకంగా ఫిర్యాదు చేసారు.కాగా టేబుల్‌అజెండాగా మరో 18 అంశాలను పొందుపరచినట్లు చైర్మెన్ వివరించారు.ఇందులో ప్రధానంగా లోబావికి విద్యుత్ దీపాల సదుపాయం,ప్రతి నెల తప్పని సరిగా 5 నుంచి 10తేది లోపల బోర్డు సమావేశం తప్పని సరిగా జరపాలని,కృష్ణారెడ్డి మండపంను సమాచార కేంద్రంగా మార్చుటకు మరో తీర్మానం చేసినట్లు చైర్మెన్ వివరించారు.సమావేశంలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ సాగర్‌బాబు, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్,బోర్డు సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు తదితరులు పాల్గొన్నారు.

## వేదాంతపురం సర్పంచ్ పదవికి రాజీనామా!



సర్పంచ్ తోట చిరంజీవి

తిరుపతిరూరల్, జూన్12 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ తోట చిరంజీవిరెడ్డి తన సర్పంచ్ పదవికి రాజీనామా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తోట చిరంజీవిరెడ్డి 25నెలలు పాటు వేదాంతపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. ఒప్పందంలో భాగం స్వచ్ఛంధంగా రాజీనామా చేసారా లేక రాజకీయంగా ఒదగలేక రాజీనామా చేసారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపన నుండి స్థానిక ఎమ్మెల్యేకి ఉన్న అనుచరులలో ముఖ్యుడుగా చిరంజీవికి పేరుంది. పార్టీ స్థాపన నుండి వేదాంతపురం గ్రామ పంచాయతీలో పార్టీ బలోపేతం కోసం కృషి చేసారు. అప్పటి అధికార పార్టీ నుండి ఎన్ని సమస్యలు ఎదురైన పోరాటపటిమతో నిలబడ్డారని చిరంజీవికి పేరుంది. పార్టీ ఏర్పాటు నుండి నమ్మకస్తుడుగా తనవెంటేఉన్న చిరంజీవి, స్థానిక ప్రజాప్రతినిధి చొరవతో వేదాంతపురం గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవం ఎన్నికైయ్యారు. తోట చిరంజీవికి 'సర్పంచ్ పదవి ముచ్చట' 25 నెలలు కాలానికే తీరిపోయింది.

## నలాగంపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

బంగారుపాళ్యం, జూన్ 12 ప్రభాతవార్త:



మండలంలోని నలగాంపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేపట్టారు. ఎస్‌పి నగర్ దళితవాడలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. దళితవాడలోని మహిళలు ఎమ్మెల్యేకి మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నలగాంపల్లి తెలుగుదేశంకు పెట్టింది పేరని అంటారని అయితే గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరుగలేదని విమర్శించారు. తెలుగుదేశం పాలనలో నలగాంపల్లిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరుగకపోవడం విడ్డూరంగా వుందన్నారు. నాయకులు సొంత గ్రామాల్లో వుండకుండా బయట వుంటూ గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, వైకాపా నాయకులు రఘునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాకానుక పంపిణీ



బంగారుపాళ్యం, జూన్ 12 ప్రభాతవార్త: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. మండలంలో 5,900 మంది విద్యార్థులకు ప్రభుత్వం విద్యా కానుకలను పంపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, జయకుమార్‌లు, సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఎంపిటిసీ ఉషారాణి, హెడ్మాస్టర్ రాజేంద్ర, ఎంఇఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు



గుడిపాల, జూన్ 12 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. జన్మదినం సందర్భంగా ఎంపీపీ ప్రసాద్‌రెడ్డిని మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైకాపా నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో చిత్తూరు నగర మేయర్ అముద, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, వైకాపా నాయకులు కృష్ణారెడ్డి, జ్ఞాన జగదీష్, జనార్దన్, రజనీకాంత్, పళైఅరసి, సాయి, చిట్టిబాబు, శింబు, సామ్యేల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, జూన్ 12 ప్రభాతవార్త : మండలంలోని చవటగుంటలో వేలసిన కామాక్షీ సమేత ఆవుదేవర నందీశ్వర ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు వివిధ అభిషేక పూజలు చేసి ప్రత్యేకంగా పూలు, ఆభారణాలతో అలంకరించి పురోహితులు వేద మంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జ్ఞాన కొండా రెడ్డి మనముడు, మనవరాలకు స్వామి వారి ఆశీస్సులు అందజేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, ఉభయదాతలు దివిజావంశీ కుమార్ రెడ్డిలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా వన్నియకులక్షత్రియ విభాగం అధ్యక్షుడిగా గోవిందరాజులు



శాంతిపురం, జూన్ 12 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ శాంతిపురం మండల వన్నియకులక్షత్రియ విభాగం అధ్యక్షుడిగా నడింపల్లి గోవిందరాజులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నేతృత్వంలో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శంకర్, యూత్ అధ్యక్షుడిగా మురు గేష్, యూత్ ప్రధాన కార్యదర్శిగా నారాయణస్వామిని ఎన్నుకున్నారు. నేతలు కాణిపాకం వెంకటేష్, చంద్రశేఖర్, రాజు, సాంబశివం, కేశవులు, రుద్రప్ప, శ్రీనివాసులు, జయప్ప, నాగరాజు, బాలకృష్ణ, రవి, పార్థసారథి పాల్గొన్నారు.

## అర్హులకు ఓటు హక్కు కల్పించే బాధ్యత బిఎల్‌ఒలదే

**- ఎమ్మెల్సీలు భరత్.. కంచర్ల శ్రీకాంత్**



శాంతిపురం, జూన్ 12 ప్రభాతవార్త

అర్హులకు ఓటు హక్కు కల్పించే బాధ్యత బిఎల్‌ఒలదేనని ఎమ్మెల్సీలు భరత్, కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో జరిగిన బిఎల్‌ఒల శిక్షణ సమావేశంలో వారు మాట్లాడారు. కుప్పం నియోజకవర్గం నుంచి జీవనోపాధికై ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఉంటారని వారిని బిఎల్‌ఒలు గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. అంతకుముందు బిఎల్‌ఒల సమావేశం గురించి తనకు సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తహాశీల్దార్ కౌలేష్‌ను నిలదీశారు. ఓ దశలో ఇరుపార్టీల నేతల మధ్య గొడవలు జరుగుతాయని ఊహించారు. అయితే ఎమ్మెల్యే భరత్ చాకచక్యంగా వ్యవహరించడంతో సమస్య సద్దుమణిగింది. సమావేశానికి ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాత్రమే రావాలని తెలపడంతో ఇరు పార్టీల వారు పలువురు వెనుతిరిగారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, కో ఆప్షన్ నిసార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వాలంటీర్లు

**- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**

శాంతిపురం, జూన్ 12 ప్రభాతవార్త

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వాలంటీర్లు అని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వాలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగనన్న అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వం కుప్పంలో ఏం చేసిందని ప్రశ్నించారు. త్వరలోనే కుప్పానికి హం ద్రీ-నీవా జలాలు తెస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, నేతలు దండపాణి, కృష్ణమూర్తి, ఎవి జయరాం, చెంగప్ప, రఘురాంరెడ్డి, నిసార్, భాస్కర్, జగదీష్, ఎంపిడిఓ హేమమాలిని, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్య క్రమంలో సర్పంచ్ మురళి, ఎంపిటిసి చంద్ర, పిసి ఛైర్మన్ సరిత, దేవరాజు, రేణుక, వెంకటరమణ పాల్గొన్నారు.

## గురుకులాల్లో పనిచేస్తున్న అధ్యాపకుల్ని రెన్యువల్ చేయాలి

కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త

కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలల్లో పార్ట్‌టైమ్ అధ్యాపకులుగా పనిచేస్తున్న తమను రెన్యువల్ చేయాలని అధ్యాపకులు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా తాము సిఆర్‌టి, పిజిటిలుగా పనిచేస్తున్నామన్నారు. కరోనా సమయంలో సిఆర్‌టిలతో సమానంగా అతితక్కువ వేతనంతో రాత్రి, పగలు పనిచేసి విద్యార్థులకు న్యాయం చేశామన్నారు. ప్రస్తుతం అధ్యాపకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందని తమ కుటుంబాల పరిస్థితుల దృష్ట్యా తమను రెన్యువల్ చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

తవణంపల్లె, జూన్ 12 ప్రభాతవార్త:



విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు స్థానిక ఎంఈఓ శంకరయ్యఅన్నారు. సోమవారం మండలంలోని తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యాక్రమంను ప్రారంభించారు. మండల వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరికృష్ణారెడ్డి, తడకర మధుకుమార్, పరమేశ్వరరెడ్డి, అరగొండ కిషోర్‌కుమార్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శ్రీరంజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కాణిపాకంలో...**

కాణిపాకం, జూన్ 12 ప్రభాతవార్త: మండలంలోని కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమంను ప్రారంభించారు. రాయలసీమ రీజియన్ మహిళా, శిశుసంక్షేమశాఖ ఛైర్‌పర్సన్ శైలజా చరణ్‌రెడ్డి చేతుల మీదుగా ఈకార్యక్రమంను ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం మురళీధర్‌నాయుడు, ఉపసర్పంచ్ విశ్వనాథరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ బాలకృష్ణలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఐరాలలో...**

ఐరాల, జూన్ 12 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సోమవారం ప్రభుత్వం అందించిన జగనన్న విద్యాకానుక కిట్లును పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు కిట్లును పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, వైకాపా నాయకులు, విద్యాకమిటీ ఛైర్మన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

**- జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు**



కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త

ప్రజల నివాస గృహాల మధ్య దోమల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దోమల లార్వాలు, దోమల ఉనికి కట్టడి గురించి వివరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జయశంకర్, ఎఎన్‌ఎంలు, శానిటరీ కార్యదర్శులు, హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా ఎదగాలి

**- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్**



కుప్పంరూరల్, జూన్ 12 ప్రభాతవార్త

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ సూచించారు. సోమవారం కుప్పం బాలుర హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సిఎం జగనన్న చూపుతున్న చొరవ మరెవరూ చేయలేదన్నారు. స్కూళ్ల ప్రారంభం రోజునే పుస్తకాలు, బ్యాగులు అందించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి అశ్విని మురుగేష్, కౌన్సిలర్లు రంగయ్య, రాజ్‌కుమార్, హెచ్‌ఎంలు ఈశ్వరాచారి, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన పెంచాలి : సిఐ



కుప్పంరూరల్, జూన్ 12 ప్రభాతవార్త

గ్రామాల్లో మహిళలకు రక్షణ చట్టాలపై మహిళా పోలీసులు అవగాహన పెంచాలని అర్బన్ సిఐ శ్రీధర్ సూచించారు. సోమవారం స్థానిక పిఎస్‌లో సచివాలయాల మహిళా పోలీసులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మహిళలకు ఏదేని ఇబ్బందులు, కుటుంబ సమస్యలు ఉంటే వాటిని వెంటనే పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అలాగే మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై వివరించి వారిలో చైతన్యం కలిగించాలన్నారు.

## జగనన్న విద్యాకానుక సద్వినియోగం చేసుకోవాలి

**జడ్పీటిసీ సుకుమార్**



వెదురుకుప్పం, జూన్ 12 ప్రభాతవార్త :

ప్రభుత్వం ఉన్నత ఆశయంతో విద్యాభివద్ధి కొరకు అందజేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యులు చలం పాళ్యం సుకుమార్ పేర్కొన్నారు. పాఠశాలల పున:ప్రారంభం పురస్కరించుకుని ప్రభుత్వం పంపిణీ చేస్తున్న విద్యా కానుకను సోమవారం పచ్చికాపల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. విద్యార్థులు పథకాలను సద్వినియోగం చేసుకోని ఉన్నత స్థితికి చేరుకోవాలని చూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రావు, స్థానిక వైసీపీ నాయకులు విజయ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదరం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

**గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు**

## గేదను ఢీకొన్న బైకు ..వ్యక్తి మృతి

చిల్లకూరు, జూన్ 12, ప్రభాతవార్త



మండలంలోని కొండుగుంట గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి కోట మండలం ఉనుగుంట పాళ్యెం గ్రామానికి చెందిన పండ్లూరు గోపాలయ్య (60) అనే వ్యక్తి ఆదివారం రాత్రి బైక్ పై గూడూరుకు వెళ్తుండగా హటాత్తుగా గేద అడ్డు రావడంతో బైక్ ఢీకొనడం జరిగింది. దీంతో బైకు బోల్తా పడి గోపాలయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్ధం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్య శాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సూళ్లూరుపేట, జూన్ 12 ప్రభాతవార్త

శ్రీచెంగాళమ్మ తిరునాళ్లలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జీ తెలుగు సరిగమ బృందంచే పాటకచ్చేరి, సినీ నేపథ్య గాయకులు గీతామాధురి, ప్రజ్ఞ, వాగ్దేవి, జెపి బృందంచే పాటకచ్చేరి, రైజింగ్ రాజు బృందంచే హాస్యవల్లరి, సినీ కొరియోగ్రాఫర్ సత్య మాస్టర్ బృందంచే డాన్సులు నిర్వహించగా, యాంకర్లు నందిని, సురాగ్ కార్యక్రమాలను రక్తికట్టించారు.

## విద్యార్థులకు సమస్యల స్వాగతం




కోట, జూన్ 12 ప్రభాతవార్త

వేసవి విరామం తర్వాత సోమవారం బడులు తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. నాడు-నేడుతో బడి రూపురేఖలు మారుస్తామని చెప్పిన విద్యాశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. జిల్లాలో నాడు-నేడు కింద ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించినా అధికారుల నిర్లక్ష్యం, సమన్వయలోపంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. రెండో విడత పనులు గత ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్న విద్యాశాఖ లక్ష్యం నెరవేరలేదు. సమయాన్ని పొడిగించి ఈ సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ముగించాలని నిర్ణయించారు. అయితే పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అదనపు తరగతి గదులు, గోడలు, మరికొన్ని పైకప్పు స్థాయిలో ఉన్నాయి. తొమ్మిది రకాల పనులలో భాగంగా చాలాచోట్లు గచ్చు వేయలేదు. ప్రాంగణాలు ఇసుక, కంకర, ఇటుకలు, పాత భవనాల వ్యర్థాలతో నిండిపోయి ఉన్నాయి. మరికొన్నింటిలో తరగతి గదులు చాలక చెట్ల కింద చదువులు కొనసాగించాల్సి వస్తోంది. మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాలెం, చెందోడు కోట, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కేశవరం పంచాయతీలలో నాడు-నేడు కింద అదనపు గదులు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.

## ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలి

**మండల విద్యాశాఖాధికారిని శైలజ**

ఓజిలి, జూన్ 12, ప్రభాతవార్త



విద్యార్థి దశ నుంచే పాఠ్యాంశాలను ఇష్టపడి చదవితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఇష్టపడి చదవాలని మండల విద్యాశాఖాధికారిని శైలజ అన్నారు. ఓజిలి గ్రామంలోని అరుంధతి వాడ ఎలిమెంటరీ స్కూల్‌లో పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోళ్ల నారాయణ, మంగళపూరి రవికుమార్ ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక కిట్లను ఓజిలి మండల విద్యాశాఖ అధికారిని శైలజ చేతులు మీదుగా సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు వరం లాంటివని తెలిపారు. ప్రతి విద్యార్థి జగనన్న విద్యా కానుక కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు కొన్ని కోట్ల రూపాయిలు ఖర్చు చేసి విద్యా కానుక కిట్లను అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తోళ్ళ నారాయణ, మంగళపూరి రవికుమార్, విద్యార్థిని విద్యార్థులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నకిలీ విలేకరులకు ఇచ్చిన ఎన్‌ఓసిలను రద్దు చేయాలి

**జర్నలిస్టులకు మద్దతు తెలిపిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ**

గూడూరు, జూన్ 12, ప్రభాతవార్త



గూడూరు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అధికారులు పేట్రేగిపోతున్నారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. అటువంటి వారిని కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉండే జర్నలిస్టులే అధికారుల వైఖరితో రోడ్డుకెక్కిన పరిస్థితిపై ఆయన స్పందించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా ముగింపు పలుకుతామని అన్నారు. గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ అయినందున వెంటనే చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సమస్య పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసే విధంగా ప్రజల్లో కూడా మార్పు రావాలని ఆయన సూచించారు. తిరుపతి జిల్లా గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట నకిలీ విలేకరులకు ఇటీవల జారీ చేసిన ఎన్‌ఓసిలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సంఘీభావం తెలిపారు. అధికారులు వైఖరి వల్ల జర్నలిస్టులు కూడా రోడ్ ఎక్కటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. పలు ప్రజా సంఘాలు కూడా జర్నలిస్టుల రిలే దీక్షలకు మద్దతు తెలిపాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్, సివిఆర్ కుమార్, చంద్రయ్య, శశి, భారతీయ జనతా పార్టీ మనోజ్ కుమార్, బిజెవైఎం చిన్న తదితరులు జర్నలిస్టులకు మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

కోట, జూన్ 12 ప్రభాతవార్త



జగనన్న విద్యాకానుక పంపిణీ ఒక పండుగ వాతావరణంలో జరగడం ఎంతో సంతోషంగా ఉందని ఎంపిడిఓ మారెళ్ల భవాని అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపిపి దాసరి అంజమ్మ, ఎంపిడిఓ మారెళ్ల భవాని, ఎంఇఓ ఎం.వెంకట సునీల్‌కుమార్, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ నాయకులు, ఎంపిటిసి సభ్యులు మొబిన్‌బాషా చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భవాని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి ధీటుగా చదవాలన్న ఉద్దేశ్యంతో నాడు-నేడు కింద కోట్లాది రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేశారని చెప్పారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్‌లో నైపుణ్యం సాధించేలా ప్రైమరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంఇఓ వెంకట సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసీపీ నాయకుడు మొబిన్‌బాషా మాట్లాడుతూ దేశ చరిత్రలోనే విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రి పంపిణీ చేయడం చారిత్రాత్మకం అన్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థుల్లో నూతన ఒరవడి సృష్టించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, విద్యా కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

**గూడూరు టూ టౌన్ సిఐ వెంకటేశ్వర రావు**

గూడూరు, జూన్ 12, ప్రభాతవార్త



మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గూడూరు టూ టౌన్ సిఐ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. సోమవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. కారు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని సిఐ అన్నారు. గూడూరు పట్టణంలో కోర్ట్ సెంటర్ సర్కిల్ వద్ద సిఐ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో సోమవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్, బండి రికార్డు లేని వాహనదారులకు జరిమానా విధించారు. టూ టౌన్ సిఐ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా బండి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. గూడూరు పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సిఐ వెంకటేశ్వరరావు తెలిపారు. అదే విధంగా వాహనదారులు విధిగా వాహన పత్రాలతో పాటు లైసెన్స్ ప్రయాణ సమయంలో వారి వద్ద ఉంచుకోవాలని తెలిపారు. వాహనాలు తనిఖీ సమయంలో వాటిని పోలీసులకు చూపాల్సిన అవసరం ఎంతైనా వుంటుందని గుర్తు చేశారు.

## బంగారు దుకాణంలో నగలు దోపిడి చేసే ఇరానీ గ్యాంగ్ దొంగ అరెస్టు

తిరుపతి క్రైం, జూన్ 12, ప్రభాతవార్త

బంగారు దుకాణంలో నగలు దోపిడి చేసే ఇరానీ గ్యాంగ్ దొంగను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. పలు ప్రాంతాల్లో రాబరీ, బ్యాగ్ లిఫ్టింగ్, బంగారు షాప్‌లలోకి వెళ్ళి ఏమార్చి దొంగతనం చేసిన పాత నేరస్తుడైన షేక్ హైదర్ ఆలీని ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా క్రైం అడిషనల్ ఎస్పి విమలా కుమారి, తిరుపతి క్రైం డిఎస్పి జి. రవికుమార్ ఆధ్వర్యంలో తిరుపతి సిసిఎస్ ఇన్స్‌ఫెక్టర్ బివి శ్రీనివాసులు, ఎస్ఐ రామస్వామి, క్రైం పార్టీ సిబ్బంది గోపికృష్ణ, వెంకటరావు, యుగంధర్‌తో వేర్వేరు బృందాలుగా ఏర్పడి సోమవారం అలిపిరి - చెర్లోపల్లి రోడ్డులోరిజనల్ సైన్స్ సెంటర్ వద్ద ఇరానీ గ్యాంగ్ సభ్యుడు అనియ హైదర్ ఆలీని అరెస్టు చేసిన్నట్లు తెలిపారు. సుమారు ఐదు లక్షల విలువ గల 91 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసిన్నట్లు పోలీసులు తెలిపారు.



బంగారు నగలు స్వాధీనం చేసుకుని నిందితులన్ని అరెస్టు చేసి చూపుతున్న పోలీసులు

## వరసిద్ధుని సేవలో మహిళా, శిశుసంక్షేమశాఖ ఛైర్‌పర్సన్

కాణిపాకం, జూన్ 11 ప్రభాతవార్త:



రాయలసీమ రీజియన్ మహిళా, శిశుసంక్షేమశాఖ ఛైర్‌పర్సన్ శైలజా చరణ్‌రెడ్డి సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.

# తిరుపతి డివిజన్

## ప్రతి ఒక్కరికి జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



తొట్టంబేడు, జూన్ 12 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి ఒక్క విద్యార్థికి జగనన్న కిట్లు పంపిణీచేశామని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఎస్ఎంసి ఛైర్మన్ ఆర్కాటు శంకర్‌లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు కిట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన తర్వాత ఇక్కడి పాఠశాలలో విద్యార్థులకు జగనన్న కిట్లను పంపిణీచేశారు. అనంతరం జగనన్న కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థినీ విద్యార్థులు వీక్షించేలా టివిలు ఏర్పాటు చేశారు. ఎస్ఎంసి ఛైర్మన్ ఆర్కాటుశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నేడు కార్పొరేట్ తరహాలో రూపుదిద్దిన ఘనత ఒక్క జగనన్నదే అన్నారు. ప్రతి విద్యార్థి తమ లక్ష్యాన్ని నిర్దేశించి చదువుకోవాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు ముందుకెళ్ళాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసి కమిటీ సభ్యులు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మీకు అండగా ఉంటా... నన్ను ఆశీర్వదించండి: బియ్యపు



శ్రీకాళహస్తి రూరల్, జూన్ 12 ప్రభాతవార్త : నాలుగేళ్ళుగా మీకు కలిసి నడుస్తున్నాను. మీలో ఒక్కడిగా మీ సేవకుడిగా పని చేస్తున్నాను. మీ కష్టాలు నా కష్టంగా భావించి సహకరిస్తున్నాను. మీ సంతోషాల్లో భాగస్వామి అవుతున్నాను. కలకాలం మీకు అండగా ఉంటా! నన్ను ఆశీర్వదించండి అంటూ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. సోమవారం యువ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా నవరత్నాలను అందించారు. ఎన్నో సంక్షేమ పథకాలు అందించారు. నిరుపేదలైనఅర్హులకు సరాసరి దళారుల సంబంధం లేకుండా ఖాతాల్లో నగదు అందిస్తున్నారు. మరి జనం ఇంకేం కోరుకుంటున్నారని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి ప్రజలను ప్రశ్నిస్తూ ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరిస్తున్నారు.' నువ్వే మా నమ్మకం జగన్' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన శ్రీకాళహస్తి మండలంలోని టిఎంవి కండ్రిగ సచివాలయ పరిధిలోని టిఎంవి కండ్రిగ గిరిజన కాలనీల్లో పర్యటించారు. ఆయనకు గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. ఆయనతోపాటు అమ్మపాళెం మాజి సర్పంచ్ కందాటి వెంకట రాఘవరెడ్డి, చక్కల కిరణ్, చుక్కల ఎల్లయ్య, ప్రవీణ్, మహేష్, చంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మునికృష్ణ, నవీన్, రఘు,కేశవరెడ్డి, బత్తయ్య,వెంకటయ్య, పైకూరిప్రసాద్ వైకాపానాయకులు మండల అధికారులు తదితరులుపాల్గొన్నారు.

## గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు అందించండి



తొట్టంబేడు, జూన్ 12 ప్రభాతవార్త : ఎఐయుటియుసి అనుబంధ సంఘమైన ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తొట్టంబేడు ఎంపిడిఓ కార్యాలయం వద్ద నిరసన పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి ఏ.హరీష్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరనా సమయంలో తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ఐసోలేషన్ మరియు క్వారంటైన్ సెంటర్లలో పనిచేశారని వారికి కొన్ని నెలలుగా జీతాలు అందక సతమతమవుతున్నారని అప్పులు చేసే ఇబ్బందులు పాలయి తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు ఓవైపు మరోవైపు వేతనాలు రాక పారిశుద్య కార్మికుల జీవితాలు దుర్భరకంగా తయారయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు సత్వరం చెల్లించాలని, గ్రామ పంచాయతీ కార్మికులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందించడంతో పాటు అందరికి పిఎఫ్ మరియు ఈఎస్‌ఐ సౌకర్యం, గ్రామ పంచాయతీ కార్మికుల తొలగింపులు మరియు వేదింపులు వెంటనే ఆపివేయాలనానరు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయ సూపరింటెండెంట్ మధుసూధన్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు వెంకటేశ్వర్లు, రాజేష్, పాపయ్య, సుధాకర్, పలువురు పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

## అక్షరాభ్యాస కార్యక్రమానికి పలకలు వితరణ



శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా గురుదక్షిణామూర్తి వద్ద నిర్వహించే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి పట్టణానికి చెందిన ఐఓసిఎల్ డీలర్స్ బిజినపల్లిసుజలక్ష్మి మరియు బిజినపల్లి ముని మహేష్ బాబు కుటుంబ సభ్యులు రూ.70వేలు విలువచేసే పలకలు, బలపాలు మరియు పుస్తక సామగ్రిని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందించారు. ఈసందర్భంగా దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీహరి, ధర్మకర్తల మండలి సభ్యురాలు రమాప్రభ, పట్టణ ప్రముఖులు భాస్కర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ పనులకు అడ్డంకి కలిగించేవారిపై చర్యలు తీసుకోండి

**-తిరుపతిరూరల్ తహశీల్దార్‌ను కోరిన సర్పంచ్ భారతి**



తిరుపతిరూరల్, జూన్12 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ సి.మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కాలూరులో శ్రీరామాలయ నిర్మాణానికి ఆటంకం కలిగించే సుబ్రమణ్యం, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని సి.మల్లవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ మొక్కల భారతి కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతిరూరల్ తహశీల్దార్ టివి.సుబ్రమణ్యం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సర్పంచ్ భారతి మాట్లాడుతూ యేళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న రాముల ఆలయ స్థలంలో నూతనంగా ఆలయ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరై, భూమిపూజకు వెళ్ళిన గ్రామస్తులపై దాడికి దిగినవారిని కఠినంగా శిక్షించాలన్నారు. గ్రామ కంఠానికి చెందిన స్థలంలో మేము దానం ఇచ్చామంటూ తప్పుడు ధ్రువ పత్రాలను చూపుతూ ఆలయ నిర్మాణానికి అడ్డుపడటమే కాకుండా తప్పుడు పత్రాలు సృష్టించి ఆలయ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్న సుబ్రమణ్యం, సుబ్రమణ్యం కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తిమ్మారెడ్డి, గ్రామస్తులు చాముండేశ్వరి, భవనేశ్వరి, దివ్య, వెంకటరెడ్డి, గురవయ్య, సుబ్రమణ్యంరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమాలు గుర్తింపునకు దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి కలెక్టరేట్, జూన్ 12 ప్రభాతవార్త : చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాలోని వృద్ధాశ్రమాలు నిర్వహించే వారు తప్పనిసరిగా వయో వృద్ధుల శాఖ ద్వారా అనుమతి పొందాలని, ఈ మేరకు దృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దృవీకరణ పత్రాలతో ఈ కార్యాలయంలో దరకాస్తు చేసుకున్న నెల రోజుల్లో అనుమతి ఈ శాఖ ద్వారా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గుర్తింపు ఉంటేనే వృద్ధాశ్రమాలకు అనుమతిస్తామని మిగిలినవి గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్నట్లు పరిగణించాల్సి ఉంటుందని తెలిపారు.

# మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక





నరసింహులు-పుట్టా మహేంద్ర

తిరుపతి టౌన్, జూన్ 12 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభలు తిరుపతి నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలపై ఈ మహా సభలో ప్రధానంగా చర్చించామని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాధాకృష్ణ అన్నారు. జిల్లాలో అనేక ప్రభుత్వ హాస్పిటల్‌లో పారిశుద్ధ్య పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన జీవో నెంబర్ 549 ప్రకారం ఏ ఒక్కరికి కూడా జీతాలు చెల్లించడం లేదని ప్రతి అధికారికి తెలిసిన కాంట్రాక్టర్లు ఇస్తున్న మామూళ్లకు అలవాటు పడిన అధికారులు కళ్ళు మూసుకొని వర్కర్ల కష్టాన్ని కాంట్రాక్టర్ నుండి లంచాల రూపంలో తీసుకుని తింటున్నారన్నారు. అదే విధంగా కాంట్రాక్టరు మారిన ప్రతి సారి కార్మికులకు కష్టాలు తప్పట్లేదన్నారు. కార్మికుల సమస్యల కోసం రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధం అవుతామని అధికారులకు హెచ్చరిక జారీ చేశారు. అనంతరం ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ఏపీమెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా కె. రాధాకృష్ణ, అధ్యక్షులుగా పి. నరసింహులు, ఉపాధ్యక్షులుగా అంకమ్మ (పుత్తూరు), గోపి (శ్రీకాళహస్తి), మురళి (గూడూరు), చంద్ర (చంద్రగిరి), వరలక్ష్మి (రూయ హాస్పిటల్ తిరుపతి), మంజుల (మెడికల్ కాలేజీ తిరుపతి) ప్రధాన కార్యదర్శిగా పుట్టా మహేంద్ర, సహాయ కార్యదర్శులుగా పి. కిషోర్, ఎం. మునివేలు, పి. మీనా, ఎస్. సునీల్ (తిరుపతి రుయా హాస్పిటల్), కోశాధికారిగా ఎన్. పురోషోత్తం వీరితో పాటు 13 మంది సభ్యులను ఏకగ్రీవంగా మహాసభలలో ఎన్నుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యా కానుక పేద విద్యార్థులకు ఓ వరం : యంపిపి



నింద్ర,జూన్ 12 ప్రభాతవార్త : జగనన్న విద్యాకానుక పేద విద్యార్థులకు ఓ వరం అని నింద్ర యంపిపి దీపాజలంధర్‌రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి నారాయణ అధ్యక్షతన నాల్గోవ విడత జగనన్న విద్యాకానుక కిట్లును యంపిపి దీపాజలంధర్ చేతుల మీదగా విద్యార్థులకు అందజేసారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ,ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే 43,10,165 మంది విద్యార్థులకు రు.1,042కోట్లు ఖర్చుతో విద్యాకానుక కిట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి ఉచితంగా బైలింగ్యువల్ పాఠ్యపుస్తకాలు నోటుబుక్స్, వర్క్‌బుక్స్,కుట్టుకూలీతో సహా మూడుజతల యూనిఫామ్‌లు,ఒకజత బూట్లు,రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూల్ బ్యాగ్‌లుతో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలుతొలిరోజే పంపిణి చేసినారు. ఈకార్య క్రమంలో నింద్ర సర్పంచ్ వసంతబాబురెడ్డి,డైరెక్టర్ జయశ్రీ,వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్ లాల్, నాయకులు సంపత్‌కుమార్,కో ఆప్షన్ మెంబరు అనిల్, గోపి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు అండగా రాష్ట్రముఖ్యమంత్రి



కార్వేటినగరం,జూన్ 12 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటున్నారని ఎంపిపి లతాబాలాజీ అన్నారు. కార్వేటినగరం ఆర్‌కెయస్‌ఆర్ హైస్కూల్లో 4వ విడత జగనన్న విద్యాకానుక పరికరాలను పంపిణీ చేసి ప్రసంగించారు. గత ప్రభుత్వం విద్యార్థులకు నామమాత్రంగా పరికరాలు అందించి చేతులు దులుపు కొనేవారని, జగనన్న నాడు-నేడు పథకం అమలు చేసి శిథిలావస్థల్లో ఉన్న భవనాలను ఇంద్రభవనాల్లా అన్ని హంగులతో నిర్మించి పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా అచ్చు పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు,మూడు జతల యూనిఫాం, బూట్లు, సాక్సు, డిక్షనరీలను 1నుండి10వ తరగతి విద్యార్థులకు అందించారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు టివిలు, మొబైల్‌ఫోన్లు ఆపి వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మురళీమోహన్, ఎంఇఓ విజయ్‌కుమార్, సర్పంచ్ ధనంజయవర్మ,కో-ఆప్షన్‌మెంబర్ పట్నం ప్రభాకర్, ప్రధానోపాధ్యా యురాలు ఎం.నీరజ, వైస్‌సర్పంచ్ శాంతిశేషాద్రి,ఉపాధ్యాయులు ఉమాశంకర్, నాగలక్ష్మి, మాధవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాపు,సంక్షేమసేన మండల అధ్యక్షుడిగా మన్నేరు రవి



కార్వేటినగరం,జూన్ 12 ప్రభాతవార్త: కార్వేటినగరం మండల కాపు,సంక్షేమసేన అధ్యక్షుడిగా మన్నేరు రవిని ఎంపిక చేసినట్లు ఎపి రాష్ట్ర కాపు,సంక్షేమసేన ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.గోపిరాయల్ తెలిపారు. నాకు ఇచ్చిన పదవికి పూర్తిగా న్యాయం చేస్తానని,సంఘం అభివృద్ధికి పనిచేస్తానని తెలిపారు. నాకు సహకరించిన కెయస్‌యస్ వ్యవస్థాపకులు హరిరామజోగయ్య,ఆర్కాట్ కృష్ణప్రసాద్,జిడినెల్లూరు నియోజకవర్గ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ



నగరి, జూన్ 12 ప్రభాతవార్త: నగరి రూరల్ మండలం ఎం కొత్తూరులో జడ్పీ హైస్కూలు ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లను మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా 1-5 తరగతి పిల్లలతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీని బడులు తెరిచిన తొలి రోజే విద్యార్థులకు బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్, కుట్టు కూలితో సహా మూడు జతల యూనిఫాం క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ(6-10 పిల్లలకు) పిక్టోరియల్ డిక్షనరీ, (1-5 తరగతి పిల్లలకు) కూడిన విద్యా కానుక కిట్లు పంపిణీని బడులు తెరిచిన తొలి రోజే విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి దాదాపు రూ.2,400 విలువైన విద్యా కానుక కిట్లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, ఎంపీపీ భార్గవి భాస్కర్, బుజ్జిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, వైస్‌ఎంపీపీ కన్నెప్ప, ఢిల్లీబాబు, సర్పంచ్‌లు నరసింహ, రవి, కన్వీనర్ హరి, కో-ఆప్షన్ మెంబరు తిరుమలరెడ్డి, ముడిపల్లి ఎంపీటీసీ మధు, సుబ్రహ్మణ్యం, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## స్మశాన స్థలం సమస్య పరిష్కరించాలి



తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 12 ప్రభాతవార్త: ఎన్నో ఏళ్లగా తిమ్మినాయుడుపాళెం గ్రామానికి చెందిన దళితులు తమ కులానికి చెందిన వారు మరణిస్తే అంత్యక్రియలు చేయడానికి వీలు లేకుండా చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. కావున తక్షణం ఆర్డీవో,ఎంఆర్‌ఓలు స్పందించి దురాక్రమణకు గురైన దళితుల స్మశాన స్థలాన్ని వారికి తిరిగి అప్పచెప్పాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి పాటూరి వెంకటరత్నం సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.తాజాగా నిన్నటి రోజు ఆదివారం ఆ గ్రామంలో ఒక దళితుడు మరణిస్తే..అతని మృతదేహాన్ని గౌరవప్రదంగా అంత్యక్రియలు చేయడానికి వీలు లేకుండా ఆ స్మశాన స్థలాన్ని ఆక్రమించుకున్న వారు అడ్డుకోవడం చాలా దుర్మార్గమన్నారు.అనాదిగా దళితులు వినియోగించుకుంటున్న ఆ స్మశాన స్థలాన్ని రెవిన్యూ అధికారులు కట్టుదిట్టంగా సర్వే చేసి స్మశాన వాటిక హద్దులను రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేసివుంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఇలాంటి ఆక్రమణలు నగరంలో పలుచోట్ల వివాదాస్పందంగా ఉన్నాయని,వెంటనే ఆర్డీవో,ఎంఆర్‌ఓలు చొరవ తీసుకుని దళితుల స్మశాన స్థలం సమస్యను పరిష్కరించాలన్నారు.లేని పక్షంలో సమస్య పరిష్కారం కోసం సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రత్యేక పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు.

## ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందచేత




తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 12 ప్రభాతవార్త: గత నెల మేలో తమ విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరచిన ఏపిఎస్ఆర్టీసీ తిరుపతి డిపోకు చెందిన 9 మంది డ్రైవర్లు,ఆరుగురు కండక్టర్లు,ఇద్దరు గ్యారేజీ సిబ్బంది తో కలిపి మొత్తం 17 మంది ఆదర్శ ఉద్యోగులకు డిపో మేనేజర్ టి.బాలాజి ప్రశంసాపత్రాలను అందచేశారు.ఈ మేరకు సోమవారం స్థానిక తిరుపతి డిపో నందు డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది,వివిధ యూనియన్ నాయకుల మధ్య అభినందన సభ ఏర్పాటు చేసి వారిని అభినందించి ప్రశంసాపత్రాలు అందచేశారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో డ్రైవర్లు పిఎం.రత్నం, సి.రమేష్, ఎన్‌వికె.రెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి, వై.శివశంకరయ్య, ఎస్.కలందర్‌సాహెబ్, యు.నాగరాజు, బి.వెంకట కుమార్, జి.అమానుల్లా, కండక్టర్లు వికె.కుమార్, ఎస్.మునెమ్మ, ఎ.శ్రీవిద్య, జి.లక్ష్మీకుమారి, టి.మల్లికార్జున, ఎం.లలిత,గ్యారేజీ సిబ్బంది కోచ్ బిల్డర్ బి.అంకయ్య,వెల్డర్ ఎస్.గురవయ్యలు ఉన్నారు.



## మంత్రి నాగార్జునకు బిషప్స్ కౌన్సిల్ ఘన స్వాగతం

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 12 ప్రభాతవార్త: సోమవారం తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా॥మేరుగ నాగార్జునకు ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ ఛైర్మన్ డా॥యలమంచిలి ప్రవీణ్ రేణిగుంట విమానాశ్రయం నందు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఎం.జీవరత్నంరెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, దేవసహాయంలు పాల్గొన్నారు.

## వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షుడికి చెవిరెడ్డి మోహిత్ సన్మానం



చంద్రగిరి, జూన్ 12 ప్రభాతవార్త: వైసిపి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు సూరి పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ ఎంఎల్‌ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కేక్ కట్ చేయించి, దుశ్శాలువతో ఘన సన్మానం చేశారు. 2024 ఎన్నికలలో మా యువజన నాయకుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎంఎల్‌ఏగా భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు విద్యార్థి విభాగం సిద్ధంగా వుందని సూరి అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సూరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి..!

**-జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ రఘునాథ రెడ్డి**



రామచంద్రాపురం, జూన్ 12 ప్రభాతవార్త: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ పి.రఘునాథ రెడ్డి అన్నారు. సోమవారం కుప్పం బాదూరు పిఆర్ఆర్ జడ్పీ హైస్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. విద్యార్థి దశ నుండి క్రమశిక్షణతో విద్యనభ్యశించి ఉన్నత పదవులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సురేష్, ఎంపిటిసి కృష్ణవేణమ్మ, వైసిపి నాయకుడు మారయ్యపాల్గొన్నారు.

## విద్యా కానుకతో విద్యార్థుల్లో హుందాతనం



చంద్రగిరి, జూన్ 12 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పాఠశాలల్లో పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్‌తో విద్యార్థుల్లో హుందాతనం పెరిగిందని రామిరెడ్డి పల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రామిరెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని రీతిన విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా రాణించి ఉజ్వలమైన భవిష్యత్తును అందిపుచ్చుకోవాలన్నారు. ఈ క్యాక్రమంలో హెచ్ఎం వనజ, టీచర్ పద్మజ, పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

## జెవికె కిట్లు పంపిణీ

విజయపురం, జూన్ 12 ప్రభాతవార్త : మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జెవికె కిట్లు సోమవారం పంపిణీ చేసినట్టు ఎంఇఒ ఆంజనేయులు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఎస్ఎంసి ఛైర్మన్, సర్పంచ్, ప్రజా ప్రతినిధుల ద్వారా పంపిణీ చేశారు. మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో సర్పంచ్ జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్ కిట్లు పంపిణీ చేశారు.ఎంపిడిఒ ప్రసాద్, సర్పంచ్ విద్యాభాస్కర్‌రెడ్డి, ఎంఇఒలు విద్యార్థులకు అందించారు.

## మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం : జేఈవో

తిరుపతి విద్య, జూన్ 12 ప్రభాతవార్త : విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడానికి టిటిడి తన విద్యా సంస్థల్లో స్వయంగా మధ్యాహ్నం బోజన కార్యక్రమం నిర్వహిస్తోందని జేఈఓ సధా భార్గవి చెప్పారు. శ్రీ గోవిందరాజ స్వామి ఉన్నత పాఠశాలలో సోమవారం ఆమె విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభించి, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల్లో కూడా లేని తరహాలో టిటిడి విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు చక్కని వాతావరణం, వసతులు కల్పించినట్లు తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆమె విద్యార్థులకు పిలుపునిచ్చారు. టిటిడి విద్యా సంస్థల్లోని మూడు వేల మంది విద్యార్థులకు మధ్యాహ్న బోజనం ద్వారా నాణ్యమైన ఆహారం అందించడానికి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఏవి ధర్మారెడ్డి ఎంతో సహకరించారని ఆమె చెప్పారు. డిఈవో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గత నాలుగేళ్ళుగా జేఈవో సదాభార్గవి నేతృత్వంలో టిటిడి విద్యా సంస్థల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. విద్యా సంస్థల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, ఎస్జిఎస్ కళాశాల ప్రిన్సిపల్ వేణు గోపాల్ రెడ్డి, ఏఈవో ఈశ్వరయ్య, క్యాటరింగ్ ఆఫీసర్ విజయ భాస్కర్, ఎస్‌వి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెడ్డెమ్మ, శ్రీ కోదండస్వామి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర బాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో అడ్మిషన్స్ ప్రారంభం



తిరుపతి విద్య, జూన్ 12, ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో 2023 - 24 సంవత్సరంకు సంబంధించి ప్రథమ సంవత్సరానికి అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయి. విద్యార్థినిలను మెరిట్ ఆదారంగా రోస్టర్ విధానంలో ఎంపిక చేయడం జరిగింది. విద్యార్థినులు ఎంపిక జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచడం జరిగింది. ఎన్నికైన విద్యార్థినుల సెల్ ఫోన్లకు మెసేజ్ కూడా పంపడమైంది. ఉదయం 9 గంటలకు కళాశాల ప్రిన్సిపల్ డా. సి. భువనేశ్వరి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించి ప్రిన్సిపల్ విద్యార్థినులకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ విధానం పై తగు సూచనలు ఇచ్చారు. వారు అడిగినప్రశ్నలకు సమాధానం చెప్పడం జరిగిందన్నారు. మొదటి రోజు అన్ని గ్రూపుల్లో కలసి 120 మంది దాకా సీట్లు పొందారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

## జగనన్నకు తోడుగా మధన్నకు నీడగా ఉందాం : వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మెన్



శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త : జగనన్నకు తోడుగా ఉందాం. మధన్నకు నీడగా గెలిపించుకుందామని తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మెన్ షేక్ సిరాజ్‌బాషా అన్నారు.సోమవారం ఆయన ముస్లింలు నివాసముంటున్న ప్రాంతాల్లో పర్యటించి ముస్లింలను చైతన్య పరచారు.ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ ఖాదర్‌బాషా సూచనల మేరకు 'హర్‌దిల్‌మే వైయస్ఆర్- హమ్‌సబ్‌జగనకే సాథ్' కార్యక్రమాలను నిర్వహించారు.సోమవారం మస్‌జిద్ ఏ హుదా పరిసరాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం మైనారిటి ముస్లింలకు అందిస్తున్న పథకాలు చేయూతను గురించి వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. కాగా శ్రీకాళహస్తి పట్టణంలో వందలాది మంది నిరుపేదలకు చిరువ్యాపారులకు తోపుడు బండ్లను అందించారు.అలాగే కరోనా కష్టకాలంలో తనకు ఇబ్బంది అయినా లెక్క చేయక మైనారిటి ముస్లింలకు సహాయం అందించటంలో మధన్న ముందున్నారన్నారు. నిరుపేద మైనారిటి ముస్లింల ఇళ్ళలో నిరుపేద వధువుకు 'మేనమామ సాంగ్యం'తో ఆదుకుంటున్నారన్నారు. ఎప్పుడూ ఏ సమయంలో అయినా అందుబాటులో ఉంటూ నేనున్నానని ఆదుకుంటున్న మధన్నను మళ్ళీ,మళ్ళీ గెలిపించుకోవాలని సిరాజ్‌బాషా పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమాల్లో సిరాజ్‌తో పాటు ఎస్‌బావాజి, ఎస్.ఉస్మాన్, మౌలానా మహబూబ్‌బాషా, అమిర్‌బాషా, ఎస్.కలీం, ఎస్.చానా, ఎస్.రఫీ, ఎస్.గౌస్‌మొహీద్దిన్,సయ్యద్ అలీ పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బంది విధులను క్రమబద్ధీకరించండి

**-కలెక్టర్, డ్వామా పిడికి వినతి**

తొట్టంబేడు, జూన్ 12 ప్రభాతవార్త : రాష్ట్రంలోని పలుశాఖలలోసుమారు 11వేల కాంటాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులను క్రమబద్ధీకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ గత 17సంవత్సరాలుగా వివిధ స్థాయిలో పనిచేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది యొక్క విధులను కూడా క్రమబద్ధీకరించాలని కోరుతూ రాష్ట్ర ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, మరియు డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందించారు.

